‘పది’ పరీక్షలకు సర్వం సిద్ధం

- 17 నుంచి 31 వరకూ నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- రాజానగరం నియోజకవర్గంలో 3,131 మంది విద్యార్థులు
- మూడు మండలాలలో 18 కేంద్రాలు



పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

రాజానగరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధమయ్యాయి. ఈ పరీక్షలను సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్‌ను ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసింది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకూ పరీక్షలు నిర్వహిస్తారు. నిర్ణీత సమయానికంటే ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. మాస్ కాపీయింగ్ జరగకుండా నిరోధించడంతో పాటు పరిసరాలలో ఉండే జిరాక్స్ సెంటర్లను కూడా పరీక్ష సమయంలో మూసివేయిస్తున్నారు. మండల విద్యాశాఖాధికారులు రామన్నదొర, జ్యోతి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి కేంద్రంలో విద్యార్థులకు తాగునీటి, ఫ్యాన్లను ఏర్పాటు చేశామన్నారు. గాలి, వెలుతురు వచ్చేలా చర్యలు తీసుకున్నామని, అత్యవసర వైద్యసేవల (హెల్త్ డెస్క్)ను కూడా అందుబాటులో ఉంచినట్టు తెలిపారు.

నియోజకవర్గంలో..

రాజానగరం నియోజకవర్గంలోని మూడు మండలాల నుంచి 3,131 మంది (1,533 మంది బాలురు, 1,598 మంది బాలికలు) విద్యార్థులకు పరీక్షలు సిద్ధమవుతున్నారు. వారి కోసం 18 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

- రాజానగరం మండలంలో 1,184 మంది విద్యార్థులకు గాను (576 మంది బాలురు, 608 మంది బాలికలు) ప్రభుత్వ పాఠశాలల నుంచి 761 మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి 423 మంది పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం రాజానగరం, నరేంద్రపురం, తోకాడ, కానవరం, దివాన్ చెరువు, సంపత్‌నగరం ఉన్నత పాఠశాలలతో పాటు దివాన్ చెరువులోని సూర్య గ్లోబల్ స్కూల్‌ను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశారు.
- కోరుకొండలో 1,261 మంది విద్యార్థులకు గాను (618 మంది బాలురు, 643 మంది బాలికలు) ప్రభుత్వ పాఠశాలల నుంచి 884 మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి 377 మంది పరీక్షలకు సిద్ధమవుతున్నారు. వీరి కోసం కోరుకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు, శ్రీరంగపట్నం, గాడాల, దోసకాయలపల్లి, గాదరాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు దోసకాయపల్లిలోని చెరుకూరి స్కూల్‌ను కేంద్రాలుగా సిద్ధం చేశారు.
- సీతానగరంలో 686 మంది విద్యార్థులకు గాను (339 మంది బాలురు, 347 మంది బాలికలు) ప్రభుత్వ పాఠశాలల నుంచి 416 మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి 270 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. ఈ విద్యార్థుల కోసం సీతానగరం, రఘుదేవపురం, వెదుళ్లపల్లిలలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలు, చినకొండేపూడిలోని సూర్యచంద్ర స్కూల్‌ను పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

అత్యంత కీలకం

ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి అత్యంత కీలకంగా ఉంటుంది. ఇక్కడ సాధించిన మార్కులే ముందు చదువులకు మార్గాన్ని ఏర్పాటు చేస్తాయి. ఒక రకంగా చెప్పాలంటే విద్యార్థి భవిష్యత్తు ఆ మార్కులపైనే ఆధారపడి ఉంటుంది. ఉన్నత చదువుల నుంచి ఉద్యోగాలు పొందే సమయంలోనూ ఇక్కడ సాధించిన మార్కులే కొలమానంగా మారతాయి. అందుకనే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అంతటి ప్రాధాన్యతనిస్తారు.

ఉపాధ్యాయులకూ పరీక్షే

పరీక్షలు బాగా రాసి, మంచి మార్కులు సాధించాలనే తపన విద్యార్థికి ఎంత ఉంటుందో, అత్యుత్తమ ఫలితాలను అందుకోవాలని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు ఉంటుంది. ఇందుకోసం నిరంతరం విద్యార్థులను చదివిస్తూ, తరచుగా పరీక్షలు రాయిస్తూ, గ్రేడ్‌లుగా విభజించి, సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు తీసుకుంటూ అందరినీ ముందుకు నెట్టే పనిలో ఉపాధ్యాయులు ఉంటారు.

క్లుప్తంగా

సంకల్ప పూజలు ప్రారంభం



సంకల్ప పూజలు నిర్వహిస్తున్న పండితులు

పెదపూడి: పుట్టకొండలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సోమవారం ఉదయం 9.24 గంటలకు పరవాసుదేవులు, మధురకవి ఆళ్వార్ల ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన సంకల్ప పూజలను శనివారం ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పీఏ అనంతాచార్యులు ఆధ్వర్యంలో ప్రారంభించారు. 30 మంది వైష్ణవ సంప్రదాయ పండితులు ఈ పూజలు నిర్వహిస్తున్నారు.

వైభవంగా నారసింహుని శ్రీపుష్పయాగం



దేవస్థానం ఆవరణలో ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహిస్తున్న భక్తులు

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి శ్రీపుష్పయాగాన్ని శనివారం రాత్రి కల్యాణ మండపంలో వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ రంగరాజభట్టర్, అర్చకస్వామి చంటి బాబు మాట్లాడుతూ ఏడు రోజుల పాటు నిర్వహించిన స్వామివారి తీర్థానికి భక్తులు విశేషసంఖ్యలో తరలివచ్చారన్నారు. రెడ్డి పంతులు సత్రం ఈఓ గండి వెంకటలక్ష్మీ కుమార్ మాట్లాడుతూ స్వామివారి ఉత్సవాల సందర్భంగా ఐదు రోజుల పాటు అన్నసమారాధన నిర్వహించామన్నారు. కాగా.. స్వామివారి హుండీలను శనివారం లెక్కించగా రూ.12,41,365 వచ్చింది. దీనితో కలిపి వార్షి కాదాయం రూ.రూ.23,25,537 అని అన్నవరం దేవస్థానం సూపరింటెండెంట్ శ్రీనివాసు తెలిపారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

బిక్కవోలు: ఆరికరేవుల గ్రామంలో నిర్మించిన ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి విగ్రహాల ప్రతిష్ఠ శనివారం ఘనంగా నిర్వహించారు. వీటితో పాటు విమాన గోపుర, వినాయక, లలితా త్రిపుర సుందరి అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేశారు. తొండాపు సూర్యనారాయణరెడ్డి (సూర్రెడ్డి), శ్రీలత దంపతుల చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బొడ్డు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణమూర్తి ఆదాయం రూ.7.35 లక్షలు



జి.మామిడాడలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలోని సూర్యనారాయణమూర్తి ఆలయ హుండీ ఆదాయం రూ.7,34,835 వచ్చిందని ఈఓ పాటి సత్యనారాయణ తెలిపారు. శనివారం ఆలయంలో శనివారం ఆ శాఖ అధికారి డి.శ్రీనివాస్ పర్యవేక్షణలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి రూ.5,93,121 రాగా, 2024–25 ఏడాదికి రూ.7,34,835 వచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పన్న దొరకు పరామర్శ



అప్పన్న దొరను పరామర్శిస్తున్న వీరన్న చౌదరి

మధురపూడి: కోరుకొండ మండలం జంబూపట్నం సర్పంచ్ ఉల్లి అప్పన్న దొరను బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి శనివారం పరామర్శించారు. అప్పన్నదొరకు వైద్యులు గుండె సంబంధిత శస్త్ర చికిత్స నిర్వహించి, స్టంట్ వేశారు. ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను వీరన్న చౌదరి పరామర్శించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఉల్లి చెల్లారావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉల్లి గణ, ఉల్లి పట్టాభి, తోరాటి సత్యప్రసాద్, తోరాటి సుబ్రహ్మణ్యం, ఉల్లి అయ్యప్ప, ఉల్లి విష్ణు, ఉల్లి నాగరాజు, ఉల్లి చిన్ని పాల్గొన్నారు.

పంచాయతీలకు అదనపు ఆదాయం



వర్మీకంపోస్టు ఎరువును కొనుగోలు చేస్తున్న సర్పంచ్ చంద్రకళ

పెదపూడి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నుంచి గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం లభిస్తుందని, ఆ దిశగా సచివాలయం కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి, తహసీల్దార్ పీవీ సీతాపతిరావు అన్నారు. కరకుదురులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శనివారం సందర్శించారు. అనంతరం ఉన్నత పాఠశాల వద్ద సర్పంచ్ వుండ్రు చంద్రకళ అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడుతూ సంపద తయారీ కేంద్రాల్లో వర్మి కంపోస్టు ఎరువు తయారు చేస్తున్నారన్నారు. దాన్ని రైతులకు అందుబాటు ధరకు విక్రయించాలన్నారు. సేంద్రియ ఎరువు వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రకళ పది కేజీలఎరువును నరేంద్రరెడ్డి, సీతాపతిరావుల నుంచి కొనుగులు చేశారు. కార్యక్రమంలో పెద్దాడ, కరకుదురు డీసీ చైర్మన్ సానా శ్రీనివాసరావు, తోటకూర వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ సింగిసీడి నాగ తిరుపతిరావు (దత్తుడు), హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, తోటకూర గణేష్ నాయుడు పాల్గొన్నారు.

గ్రామ దేవతలను నిత్యం పూజించాలి



పెదపూడిలో మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామ దేవతలను నిత్యం భక్తి శ్రద్ధలతో పూజించాలని వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. పెదపూడి గ్రామంలోని పెద్ద వీధిలో పునర్నిర్మించిన మహాలక్ష్మి ఆలయంలో శనివారం ఉదయం 10.29 గంటలకు నూతన విగ్రహాల ప్రతిష్ఠోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణం, విగ్రహాల ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించిన కమిటీ ప్రతినిధులు, గ్రామస్తులు, భక్తులకు అభినందనలు తెలిపారు. వచ్చే నెలలో జరిగే అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనకు పెదపూడితో పాటు కరకుదురు, దోమాడ, పెద్దాడ, కుమారప్రియం, కైకవోలు, పుట్టకొండ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, కాకర సాయిబాబు, మాజీ సర్పంచ్ మార్ని రుద్ర ఉమా మహేశ్వరరావు (పెద్దబ్బు), కాకర రామచంద్రరావు (చందు), మార్ని పెదబాబు, ఈదేటి రాంబాబు, చేవా సత్యనారాయణ పాల్గొన్నారు.

వెదురు సాగుకు బోలెడు ప్రోత్సాహకాలు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ దేవమునిరెడ్డి



దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టులోని వెదురు పెంపకం క్షేత్రాలను సందర్శించిన ఔత్సాహికులు

రాజానగరం: వెదురు సాగును ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అనేక రాయితీలను అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ వెదురు సాగుతో ఆర్థికంగా ఎదగాలని ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.దేవమునిరెడ్డి ఔత్సాహిక రైతులకు సూచించారు. ఉద్యానవన పంటలు సాగు చేసే రైతుల పొలాలలో వెదురు సాగును ప్రోత్సహించేందుకు రాజానగరంలోని జీఎస్ఎల్ జనరల్ ఆస్పత్రి, ఆడిటోరియంలో శనివారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానవన శాఖ జిల్లా అధికారి బి.సుజాత కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జాతీయ వెదురు మిషన్ ద్వారా వెదురు సాగు అభివృద్ధికి హెక్టారుకు గరిష్ఠంగా రూ.1.20 లక్షలు, నర్సరీకి హెక్టారుకు గరిష్ఠంగా రూ.20 లక్షలతో పాటు ప్రాథమిక ప్రాసెసింగ్, మౌలిక సదుపాయాలకు 50 శాతం రాయితీ ఇస్తున్నారన్నారు. ఏపీ స్టేట్ ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ బి.విజయ కుమార్ మాట్లాడుతూ వెదురును అటవీ ఉత్పత్తులుగా పరిగణించడం వల్ల 2019 వరకు వెదురును అమ్మడానికి అటవీ శాఖ అనుమతులు తీసుకోవలసి వచ్చేదన్నారు. ఇప్పుడు కల్లం మూల వెదురుకు తప్ప మిగిలిన వాటికి అనుమతులు అవసరం లేదన్నారు. అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ బివి హరిగోపాల్ మాట్లాడుతూ వ్యాపారం, విలువ ఆధారిత ఉత్పత్తులు, కార్బన్ క్రెడిట్ టు ఫామ్ అనే అంశంపై వెదురును పచ్చ బంగారంగా పేర్కొన్నారు. ఇండియన్ బ్యాంక్ రిటైర్డ్ డీజీఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తాను రిటైర్డ్ అయిన తరువాత వెదురు సాగును చేపట్టిన పొందిన అభివృద్ధిని తెలియజేశారు. అనంతరం క్షేత్ర పర్యటనలో భాగంగా దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టులోని ఏపీ స్టేట్ ఫారెస్టు అకాడమీ, అటవీ పరిశోధన కేంద్రాల ప్రాంగణంలో పెంచుతున్న వెదురుసాగు రకాలను, కడియం నర్సరీలను సందర్శించారు. కార్యక్రమంలో స్టేట్ సిల్వీ కల్చరిస్టు ఆర్.శ్రీనివాస్, జీఎస్ఎల్ హార్టీకల్చరిస్టు ప్రియాంక, ఉద్యానవన శాఖ అధికారులు, గ్రామ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు స్వచ్ఛాంధ్ర పురస్కారం



పురస్కారాన్ని అందుకున్న లక్ష్మిని అభినందిస్తున్న పీడీ విజయకుమారి, సీడీపీఓ నాగమణి తదితరులు

రాజానగరం: పల్ల కడియం అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త జి.లక్ష్మి స్వచ్ఛాంధ్ర పురస్కారం అందుకోవడం అభినందనీయమని ప్రాజెక్టు డైరెక్టర్ విజయకుమారి, సీడీపీఓ టి.నాగమణి అన్నారు. స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ప్రజలకు పరిశుభ్రత, చేతి శుభ్రత, మొక్కలు నాటడం వంటి పర్యావరణ హితమైన కార్యక్రమాలపై లక్ష్మి అవగాహన కలిగించిందన్నారు. తణుకులో శనివారం జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా రాష్ట్రంలో ఈ పురస్కారాన్ని అందుకున్న ఏకై క కార్యకర్త జి.లక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా ఆమెను సీడీపీఓతో పాటు ప్రాజెక్టు సిబ్బంది, సహ కార్యకర్తలు, ఆయాలు అభినందించారు.

జీవిత గమనాన్ని మార్చేది ‘పది’ ఫలితమే



మర్రిపూడిలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న సోమన్న చౌదరి



సంపత్ నగరంలో విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందిస్తున్న దాతలు

రంగంపేట: విద్యార్థి జీవిత గమనాన్ని మార్చేది పదో తరగతి ఫలితమేనని విశ్రాంత ఉపాధ్యాయుడు పుట్టా సోమన్నచౌదరి అన్నారు. మర్రిపూడిలోని పుట్టా శ్రీనివాస్ స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని కోరారు. పాఠశాల కమిటీ చైర్మన్ పిల్లి అన్నవరం మాట్లాడుతూ ఉత్తమ ఫలితాల కోసం పాఠశాల సిబ్బంది చేస్తున్న కృషి మరువరానిదన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు, స్కేళ్లు పంపిణీ చేశారు.

పరీక్షా సామగ్రి వితరణ

రాజానగరం: సంపత్ నగరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం పరీక్ష అట్ట, పెన్ను, పెన్సిల్, రబ్బరు, స్కేలు మున్నగు సామగ్రిని వితరణ చేశారు. ది పీఎంపీ అసోసియేషన్ సమకూర్చిన వీటిని జిల్లా అధ్యక్షుడు బళ్ల శ్రీనివాసరావు పంపిణీ చేశారు. ఈ ఏడాది జరిగే పబ్లిక్ పరీక్షలలో మండల స్థాయిలో అత్యుత్తమ మార్కులు పొందిన విద్యార్థులకు తమ అసోసియేషన్ ద్వారా బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్ఎల్‌వీ రమేష్, ఉపాధ్యాయులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

రంగంపేట: ఇంటర్ పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో చివరి రోజు ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ పేపర్–2, కామర్స్ పేపర్–2 పరీక్షలు జరిగినట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్లు బి.హేమ, ఎస్.మాధురి తెలిపారు. ఇక్కడి ఏ, బి సెంటర్లలో 468 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, ఏ సెంటర్‌లో 12 , బి సెంటర్‌లో ముగ్గురు గైర్హాజరయ్యారన్నారు. డిపార్టుమెంటల్ అధికారులుగా ఏపీఆర్‌వీ ప్రసాద్, ఎంవీఎస్ కృష్ణ వ్యవహరించారు. పరీక్షా కేంద్రాన్ని సిట్టింగ్ స్క్వాడ్ తనిఖీ చేసింది.

పదో తరగతి పరీక్షలకు మూడు కేంద్రాలు

రంగంపేట: మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ వడిశలేరు, సింగంపల్లి, రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో పరీక్షలు జరుగుతాయన్నారు. వడిశలేరు హైస్కూల్లో 183 మంది, సింగంపల్లి హైస్కూల్లో 194 మంది, రంగంపేట హైస్కూల్లో 196 మంది పరీక్షలు రాస్తారన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షా సమయానికి అరగంట ముందే హాల్ టికెట్‌తో హాజరవ్వాలన్నారు.

మధురపూడి: కోరుకొండ మండలంలోని ఏడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఎంఈఓ టి.కుశలవదొర తెలిపారు. కేంద్రాల్లో రక్షిత తాగునీరు, ఫర్నీచర్, ఫ్యాన్లు, మరుగుదొడ్లు సదుపాయాలు కల్పించామన్నారు. ఏడుగురు డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఏడుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, 94 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభం



పుట్టమట్టి తీసుకురావడానికి వెళుతున్న అర్చకులు, భక్తులు

బిక్కవోలు: పందలపాకలోని రెడ్ల రామాలయం వద్ద విగ్రహ ప్రతిష్ఠ పూజలు శనివారం ప్రారంభమయ్యాయి. అర్చకుడు యలమంచిలి ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో యాగశాల ప్రదక్షిణ, విఘ్నేశ్వర పూజ, దీక్షాధారణ, అఖండ దీపారాధన, ప్రధాన కలశారాధన, హోమాలు నిర్వహించారు. పుట్టమట్టి కోసం శివాలయం వద్ద రేవులో వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచి కొవ్వూరి గోపాలకృష్ణారెడ్డి, కరుణావతి దంపతులు, పడాల సుబ్బిరెడ్డి, రజిని దంపతులు, గొలుగూరి సత్తిరెడ్డి, పద్మావతి దంపతులు, గొలుగూరి కృష్ణారెడ్డి, దేవి దంపతులు ప్రత్యేక పూజలు చేయించారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని అరికడదాం

- పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత
- ‘నన్నయ’ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ



నన్నయ వర్సిటీ ప్రాంగణంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ



రాజానగరం తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది

రాజానగరం: పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్న ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టి, పర్యావరణ హితంగా జీవనం సాగిద్దామని ఆదికవి నన్నయ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. ×స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర₹ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి యూనివర్సిటీ ప్రాంగణాన్ని శనివారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు చేపట్టిన ప్లాస్టిక్ వ్యతిరేక ర్యాలీలోనూ ఆమె పాల్గొన్నారు.

- ప్రభుత్వ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలల్లోనూ ‘స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర’ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో చెత్తా చెదారాలను రెవెన్యూ సిబ్బందితో కలిసి తహసీల్దార్ జీఏఎల్ఎస్ దేవి శుభ్రపరిచారు. కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.
- గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) క్యాంపస్‌లోని ఇంజినీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఫార్మసీ కళాశాల్లో కార్యక్రమం జరిగింది.
- గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శ్రీకృష్ణపట్నంలో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కె.శ్రీరామ్ సహకారంతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ బి.శ్రీనివాస్, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామాలను సాధిద్దాం

బిక్కవోలు: ప్లాసిక్ రహిత గ్రామాలను సాధిద్దామని మండల ప్రత్యేక అధికారి కె.విజయ కుమారి అన్నారు. బిక్కవోలులో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ నిర్వహించారు.మండల అధికారులతో కలిసి ర్యాలీ చేశారు. ఎంపీడీవో వి.శ్రీనివాస్, తహసీల్దార్ బి.ఎస్‌వీవీ కృష్ణ, సర్పంచి ఎస్.సుమలత పాల్గొన్నారు. పందలపాకలోని పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, పీడీ యువరాజారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బిక్కవోలులో ర్యాలీ చేస్తున్న అధికారులు

పెదపూడిలో..

పెదపూడి: ఆరోగ్యవంతమైన గ్రామాల నిర్మాణానికి చేపట్టిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా నిర్వహించాలని ఈఓపీఆర్డీ ఎం సత్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడిలో సర్పంచ్ కలవల కృష్ణమూర్తి అధ్యక్షతన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామంలో శుభ్రత చర్యలు చేపట్టారు.



పెదపూడిలో శుభ్రం చేస్తున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి

వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా ఆదిరెడ్డి



నియామక పత్రం అందుకుంటున్న ఆదిరెడ్డి

పెదపూడి: జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా అనపర్తికి చెందిన డాక్టర్ నల్లమిల్లి ఆదిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు కడపలో శనివారం జరిగిన సమావేశంలో నేషనల్ చైర్మన్ డాక్టర్ సాయి రమేష్, కడప సీఐ సీతారాం చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి ఫోన్‌లో మాట్లాడుతూ, మోసపూరిత కొనుగోళ్లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ విషయంలో వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానన్నారు.

పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

పెదపూడి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు ఎంఈఓ–2 సీవీవీ సత్యనారాయణ తెలిపారు. ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డితో కలిసి ఆయన శనివారం పెదపూడి గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో 815 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు.

బాపనమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



దర్శకుడు వశిష్ఠను సత్కరిస్తున్న విశ్రాంత జడ్జి రామ్మూర్తి తదితరులు

పెదపూడి: అనపర్తి మండలం రామవరంలో కొలువైన బాపనమ్మ తల్లిని సినీ దర్శకుడు వశిష్ఠ, ఆయన తండ్రి ప్రముఖ నిర్మాత బన్ని సత్యనారాయణరెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శకుడు వశిష్ఠను ఆలయ కమిటీ ప్రతినిధి, విశ్రాంత జిల్లా జడ్జి రామ్మూర్తి వర్మ చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. వశిష్ఠ మాట్లాడుతూ అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి తనయుడు దివంగత సబ్బెళ్ల సురేష్‌రెడ్డి జ్ఞాపకార్థం నిర్మించిన ఈ ఆలయంలో బాపనమ్మ తల్లిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కర్రి మురళీకృష్ణారెడ్డి, సబ్బెళ్ల సూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.